# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 10-09-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **భారతీయ రైల్వేలు అందించే సేవలకు ఎటువంటి వస్తు సేవల పన్ను–జిఎస్టి వర్తించదని 54వ జి ఎస్ టి కౌన్సిల్ సిఫార్సు చేసింది.**
2. **వరద ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితులను సాధారణ స్థితికి తీసుకురావడానికి ప్రభుత్వం అన్నిచర్యలు తీసుకుంటోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**
3. **ఆంధ్రప్రదేశ్ లో ముంపు సమస్యను పరిష్కరించేందుకు కమిటీ వేయనున్నామని ఉప ముఖ్యమంత్రి కె పవన్ కల్యాణ్ వెల్లడించారు.**
4. **తెలంగాణలో చేనేత కార్మికులకు రుణాలను త్వరలోనే మాఫీ చేస్తామని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి చెప్పారు.**
5. **ఆత్మహత్యల నివారణ పట్ల అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ఈ రోజు ప్రపంచ ఆత్మహత్యల నివారణా దినం పాటిస్తున్నారు.**

==========================

భారతీయ రైల్వేలు అందించే సేవలకు ఎటువంటి వస్తు సేవల పన్ను–జిఎస్టి వర్తించదని జి ఎస్ టి కౌన్సిల్ సిఫార్సు చేసింది. నిన్న ఢిల్లీలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన 54వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో రైల్వే ప్లాట్‌ఫారమ్ టిక్కెట్ల అమ్మకం, వేచి వుండే గదుల సౌకర్యం, బ్యాటరీతో నడిచే కార్ సేవలతో సహా సామాన్యులకు భారతీయ రైల్వేలు అందించే సేవలకు ఎటువంటి జిఎస్టి వర్తించదని కౌన్సిల్ సిఫార్సు చేసింది. ఈ సమావేశానికి ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి, వివిధ రాష్ట్రాల ఆర్థిక మంత్రులు హాజరయ్యారు.కాగా ఈ ఏడాది జూన్ లో జరిగిన చివరి జీఎస్టీ కౌన్సిల్ సమావేశం ఉక్కు, ఇనుము, అల్యూమినియం, పాల క్యాన్లపై ఏకరీతిగా 12 శాతం జీఎస్టీని సిఫార్సు చేసింది.

--------------------------

వరద ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితులను సాధారణ స్థితికి తీసుకురావడానికి ప్రభుత్వం అన్నిచర్యలు తీసుకుంటుదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. విజయవాడలోని భవానీపురం, సితారరోడ్డు, ఊర్మిళానగర్, కబేళా సెంటర్, చిట్టినగర్, అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతాల్లో ముఖ్యమంత్రి నిన్న ఆయన పర్యటించారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, తొమ్మిది రోజుల్లో విజయవాడ నగరాన్ని సాధారణ స్థితికి తీసుకొచ్చామని అన్నారు.వరదల కారణంగా పాడైపోయిన విద్యుత్ గృహోపకరాలు బాగుచేయడానికి ఆయా కంపెనీల వారు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నగరంలో నాలుగైదు చోట్ల

మెకానిక్‌లను ఏర్పాటు చేసి వాహనాలు బాగు చేయిస్తామని చెప్పారు. చిన్న దుకాణాలు, తోపుడు బండ్లు ఉన్న వారికి ఆర్థికంగా చేయూత ఇచ్చేందుకు బ్యాంకులతో మాట్లాడి రుణాలు ఇచ్చేలా చూస్తామని ముఖ్యమంత్రి తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో ముంపు సమస్యను పరిష్కరించేందుకు క్షేత్రస్థాయి అధ్యయనం చేసి సమగ్ర నివేదిక ఇచ్చేలా కమిటీ వేయనున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ తెలిపారు. కాకినాడ జిల్లా పిఠాపురంలోని గొల్లప్రోలులో ఏలేరు వరద ప్రభావంతో ముంపు బారినపడిన ప్రాంతాల్లో నిన్న ఆయన పర్యటించారు. అనంతరం ఉపముఖ్యమంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, నీటి వనరుల ఆక్రమణలు పెరిగేకొద్దీ నష్టం జరుగుతోందన్నారు. ఏలేరు జలాశయం వరద పరిస్థితిని పర్యవేక్షిస్తున్నామని పవన్ కల్యాణ్ పేర్కొంటూ,

వాయిస్ ( 23 సెకన్లు)

---------------------------

వరద ముంపు తగ్గిన ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పూర్తి చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. విజయవాడలోని పాయకపురంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి నిన్న పర్యటించి పారిశుద్ధ్య పనులు జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పాయకాపురం వంటి కొన్ని ప్రాంతాల్లో నీరు ఇంకా నిలిచి ఉందని, ఈ రోజు సాయంత్రానికి మొత్తం నీరు తగ్గుముఖం పడుతుందని చెప్పారు. వరద తగ్గిన ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు ఈ పూర్తవుతాయని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ (27 సెకన్లు)

---------------------------

తెలంగాణలో చేనేత కార్మికులకు రుణాలను త్వరలోనే మాఫీ చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు. నిన్న హైదరాబాద్‌లోని నాంపల్లి లలిత కళాతోరణంలో ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ- ఐఐహెచ్ టీ ప్రారంభించి, చేనేత అభయహస్తం చిహ్నాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, చేనేతల రుణభారం 30 కోట్ల రూపాయలు తీర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ఏటా 2 చీరలు ఇవ్వాలని నిర్ణయించామన్నారు. చేతి వృత్తుల కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో ఐఐహెచ్ టీ కి పేరు వచ్చేలా కృషి చేస్తామని, . ఇందులో చదివే విద్యార్థులకు నెలకు 2 వేల 5 వందల రూపాయల ప్రోత్సాహక నగదును అందిస్తామన్నారు. విద్యార్థులలో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు నైపుణ్య విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు .

---------------------------

ఆత్మహత్యల నివారణ పట్ల అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ఈ రోజు ప్రపంచ ఆత్మహత్యల నివారణా దినం పాటిస్తున్నారు. ఆత్మహత్యల నివారణ కోసం కృషి చేసే అంతర్జాతీయ సంస్థ -ఐఎఎస్‌పి, ప్రపంచ ఆరోగ్య సంస్థ -డబ్ల్యుహెచ్‌ఓల సంయుక్త ఆధ్వర్యంలో ప్రతి ఏటా సెప్టెంబర్ 10వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది. ఏదైనా సమస్య ఎదురైతే ఆ సమస్యను పరిష్కరించుకునే మానసిక బలం లేక ప్రపంచ వ్యాప్తంగా పలువురు

ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ప్రతి సమస్యకూ మరణమే పరిష్కారం కాదని, ఆత్మహత్యకు ప్రేరేపించిన పరిస్థితుల కంటే, ఆ పరిస్థితులను అధిగమిస్తే వచ్చే బంగారు జీవితం గురించి ఆలోచించాలన్న అంశంపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. ఆత్మహత్యలు వంటి దుర్ఘటనలకు పాల్పడకుండా చిన్నప్పటి నుండే ఇళ్లలో తల్లి దండ్రులు, పాఠశాలలలో ఉపాధ్యాయులు పిల్లలలో తగిన మానసిక బలం, ఆత్మ విశ్వాసం కల్పించాలని , అప్పుడే ఆత్మహత్యల నివారణ సాధ్యమవుతుందని మానసిక వైద్యులు సూచిస్తున్నారు. కాగా ప్రపంచ ఆత్మహత్యల నివారణా దినం సందర్భంగా ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈ ఉదయం 10 గంటలకు ప్రసారం అవుతుంది.

---------------------------

తెలంగాణ రాష్ట్రంలో మౌలిక వసతుల అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి.. ఆ దిశగా చర్యలు తీసుకుంటుందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి బహిరంగ లేఖ రాశారు. సికింద్రాబాద్, చర్లపల్లి రైల్వే స్టేషన్లలో రైల్వే టెర్మినల్స్‌కు వెళ్లే రహదారుల విస్తరణకు తెలంగాణ ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందించాలని లేఖలో పేర్కొన్నారు. రాష్ట్రంలో రైల్వే అభివృద్ధికి సంబంధించిన రైల్వే లైన్లు, డబ్లింగ్, ట్రిప్లింగ్‌తో పాటు లైన్ల విద్యుద్దీకరణ పనులు, 40కి పైగా స్టేషన్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని లేఖలో వివరించారు. తెలంగాణలో రైల్వేల అభివృద్ధికి కేంద్రం చేపడుతున్న చర్యలకు రాష్ట్ర సహకారం అవసరమని కేంద్రమంత్రి లేఖలో పేర్కొన్నారు.

---------------------------

వరద బాధితులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి శ్రీ డోలా బాల వీరాంజనేయ తెలిపారు. విజయవాడలోని వరద ప్రభావిత ప్రాంతాలైన జక్కంపూడి కాలనీ, చిట్టి నగర్, సితారా సెంటర్ ప్రాంతాల్లో మంత్రులు నిన్న పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జక్కంపూడి కాలనీ లోని ప్రతీ బ్లాక్ కు విద్యుత్ ను పునరుద్ధరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ రాత్రికి పూర్తి స్థాయిలో విద్యుత్ ను పునరుద్ధరించనున్నామని చెప్పారు. ముంపు ప్రాంతాల్లో భోజనం, తాగునీరు, పాలు అందిస్తున్నామని, బాధితులకు అండగా ఉంటామని తెలిపారు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున, ఈ రోజు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు సెలవు ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్ ఏ ఎస్ దినేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని అన్ని. ప్రైవేట్ విద్యాసంస్థలు కూడా విధిగా సెలవు ఇవ్వాలని, ఎటువంటి తరగతులు నిర్వహించరాదని తెలిపారు. భారీ వర్షాలు కురుస్తున్నందున వాగులు, వంతెనలు దాటరాదని కలెక్టర్ సూచించారు.

---------------------------

తెలంగాణ రాష్ట్ర అర్హత పరీక్ష –టీజీసెట్ పరీక్షలు ఈ రోజు నుంచి ప్రారంభం కానున్నాయి. మూడ్రోజుల పాటు జరిగే ఈ పరీక్షలకు 33 వేల 764 మంది హాజరు కానున్నారని టీజీ సెట్ అధికారి జి నరేశ్ రెడ్డి తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు పరీక్షలు జరుగుతాయని చెప్పారు. ఈ రోజు 11 వేల 570 మంది, రేపు 10 వేల 479 మంది, ఎల్లుండి 11 వేల 265 మంది పరీక్షలకు హాజరవుతారని పేర్కొన్నారు.

---------------------------

విజయవాడ ప్రకాశం బ్యారేజీ వద్ద గేట్ల మరమ్మతు పనులు పూర్తయ్యాయని జలాశయాల గేట్ల నిపుణులు కన్నయ్యనాయుడు తెలిపారు. నిన్న ఆయన విజయవాడలో మాట్లాడుతూ, బ్యారేజీలో దెబ్బతిన్న 67, 69, 70 గేట్ల వద్ద ఉక్కుతో తయారు చేసిన భారీ కౌంటర్ వెయిట్లను ఏర్పాటు చేశామని అన్నారు. కేవలం 5 రోజుల్లోపే మూడు గేట్ల వద్ద కౌంటర్ వెయిట్లను ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

======================